క్లుప్తంగా

ప్రకృతివనం పరిశుభ్రం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ– సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జర్నలిస్టు కాలనీ రోడ్డు నెంబర్ 8లో గల పట్టణ ప్రకృతి వనంలో శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, ఎస్సారెస్పీ డీఈ గణేశ్ పాల్గొన్నారు.

‘కొత్త ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు’

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజల ఆశీర్వాదంతో ఇటీవల కొలువుదీరిన కొత్త ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు చేయడం సిగ్గుచేటని రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజల్లోకి వెళ్లి ఉద్యమిస్తామని అనడం సభ్యత కాదని, అసలు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాలు, రుణమాఫీ, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, బోధన్ చక్కెర ఫ్యాక్టరీ ఇలా చాలా విషయాల్లో పచ్చి మోసానికి పాల్పడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ఆస్తులు పెంచుకున్నారని బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారు. బీజేపీని విమర్శిస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

కరీంనగర్ అసెంబ్లీ ప్రభారీగా అడ్లూరి




బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్‌ను కరీంనగర్ అసెంబ్లీ ప్రభారిగా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నియమించినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. కరీంనగర్ అసెంబ్లీ ప్రభారిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులకు, జిల్లా బాధ్యులకు అడ్లూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

హైస్కూల్లో క్రీడా ప్రాంగణం బోర్డు



ఎడపల్లి(బోధన్): జాన్కంపేట్ జెడ్పీ హైస్కూల్‌లో తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు నాలుగు నెలలుగా స్కూల్ గోడకు పెట్టి ఉంచారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో యువకులు, విద్యార్థులకు ఆటలు ఆడేందుకు తెలంగాణ క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాలని సూచించింది. దీంతో తెలంగాణ క్రీడా స్థలంలో చదును చేసి బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ బోర్డు హైస్కూల్‌లో దర్శనం ఇస్తుంది. అధికారులు ఈ బోర్డును స్కూల్‌కు గాని తెలంగాణ క్రీడా స్థలంలో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, క్రీడా అభిమానులు కోరుతున్నారు.

సర్పంచ్ సేవలు అభినందనీయం



రుద్రూర్: రాణంపల్లి గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా రోజా లక్ష్మణ్ అందించిన సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ నరోజి గంగారాం అన్నారు. రాణంపల్లిలో ఆదివారం జీపీ పాలక వర్గ సభ్యులను స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ.. చిన్న గ్రామమైనా మాజీ స్పీకర్ సహకారంతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. రైతు బంధు అధ్యక్షుడు తోట సంగయ్య, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, అక్కపల్లి నాగేందర్ పాల్గొన్నారు.

భారతరత్న ఇవ్వాలి

వేల్పూర్: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్, కొత్తపల్లి ఎస్ మాజీ సర్పంచ్ గడ్డం నర్సారెడ్డి, పచ్చలనడ్కుడ సొసైటీ మాజీ చైర్మన్ రాజారెడ్డి ఆదివారం కోరారు. మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి భారతరత్న ఇవ్వడం హర్షణీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడమే కాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్‌టీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు.

‘మధ్యాహ్న’ పంచాయితీ

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను హెచ్‌ఎం మార్చడం వివాదానికి దారి తీసింది. తాజాగా ఏజెన్సీ మార్పు అంశం తెరపైకి రావడంతో మూడునాలుగు రోజులుగా పంచాయితీ సాగుతోంది. ఏజెన్సీ మార్పుపై విచారించేందుకు తహసీల్దార్ సంతోష్, ఎంఈవో రాజేశ్వర్ గత శుక్రవారం పాఠశాలకు వచ్చి పరిస్థితిని తెలుసుకున్నారు. హెచ్‌ఎం తన సొంత నిర్ణయంతో ఏజెన్సీ నిర్వాహకులను మారుస్తున్నట్లు వారు అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

అసలేం జరిగింది..?

పాఠశాలలో సుమారు 15 ఏళ్లుగా గ్రామానికి చెందిన సాయమ్మ ఏజెన్సీ నిర్వాహకురాలిగా కొనసాగుతున్నది. ఆమెకు తోడుగా గ్రామానికి చెందిన రాజవ్వను కార్మికురాలిగా పెట్టుకుంది. సాయమ్మకు తోడుగా ఆమె స్రవంతి సైతం వచ్చి మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసేది. అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా సాయమ్మ రెండు సంవత్సరాల క్రితం ఏజెన్సీ నిర్వాహకురాలిగా రాజీనామా చేసింది. దీంతో ఏజెన్సీని సాయమ్మ కోడలి పేరుపైకి హెచ్‌ఎం మార్చారు. ఉన్నతాధికారులకు తెలియకుండానే హెచ్‌ఎం ఏజెన్సీని మార్చారని, ఎప్పటి నుంచో పని చేస్తున్న కార్మికురాలు రాజవ్వను వంట చేసేందుకు అనుమతించలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అప్పటి నుంచి వివాదం మొదలైంది. ఏజెన్సీ నిర్వాహకురాలు రాజీనామా చేస్తే నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చి, ఎస్ఎంసీ తీర్మానం ప్రకారం నూతన ఏజెన్సీని నియమించాలని, వివాదం ముదరకముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సోన్‌పేట్ పాఠశాల

ఎస్ఎంసీ తీర్మానం ప్రకారమే..

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలి రాజీనామా చేయడంతో ఎస్ఎంసీ తీర్మానం ప్రకారమే ఆమె కోడలిని నియమించాం. ఉన్నతాధికారుల అనుమతితోనే జరిగింది. సొంత నిర్ణయం ఏమీ లేదు. – కృష్ణ, హెచ్‌ఎం, సోన్‌పేట్

రెండు రోజుల్లో పరిష్కరిస్తాం

పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ మార్పునకు సంబంధించిన సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. హెచ్‌ఎంను పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో సమస్య మొదలైంది. – రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

సీఎం కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

నందిపేట్(ఆర్మూర్): కుద్వాన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి(సీఎం కప్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. క్రీడా పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, గ్రామస్థాయిలో క్రీడా పోటీలు యువకులను చైతన్య వంతులుగా చేస్తాయన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, యూత్ కాంగ్రెస్ నాయకులు బైండ్ల ప్రశాంత్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

పేపర్ అట్టలతో రామమందిర నిర్మాణం



ఎడపల్లి(బోధన్): అయోధ్యలో జనవరి 22న రామమందిరాన్ని ప్రారంభించిన సంగతి తెల్సిందే. దీంతో దేశవ్యాప్తంగా కళాకారులు రామ మందిరం నమూనాలను తయారు చేస్తున్నారు. తాజాగా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌లో ఉప్పు నవనీత రామ మందిరం నమూనాను అట్టముక్కలు, థర్మకోల్, డ్రెస్‌లైన్‌లతో తయారు చేసింది. దీని నిర్మాణానికి నాలుగు రోజుల సమయం పట్టింది. కాలనీవాసులు, గ్రామస్తులు అభినందించారు.

చెట్లను నరికి వేస్తున్నారు..!



మెండోరా మండలం వెల్కటూర్ శివారులో..



మెండోరా మండల కేంద్రం శివారులో..

బాల్కొండ: ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్ల కిరువైపులా నాటిన మొక్కలను నరికి వేస్తున్నారు. పంట చేలకు నీడ వస్తుందనే కారణంతో తొలగిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పెంచిన చెట్లు చూస్తుండగానే నేలకొరిగిపోతున్నాయి. కొందరు రైతులు కొమ్మలను నరికి వేస్తే, మరికొందరు మొత్తం చెట్లనే నరికి వేస్తున్నారు. దీంతో పర్యావరణానికి ఉపయోగపడే చెట్లు లేకుండాపోతున్నాయి. ఫారెస్ట్ అధికారులు స్పందించి వెంటనే చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

తుప్పు పడుతున్న వాహనాలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా స్వీపింగ్ యంత్రం



తుప్పు పడుతున్న ట్రాక్టర్లు, చెత్త సేకరించే వ్యాన్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పారిశుధ్య నిర్వహణ తడి, పొడి చెత్తసేకరణ చేసి డంపింగ్‌యార్డుకు తరలించేందుకు కేటాయించిన వాహనాలు తుప్పుపడుతున్నాయి. మున్సిపల్‌లో మొత్తం 35 వాహనాలు ఉన్నాయి. అందులో చెత్త సేకరించే వ్యాన్‌లు 19, ట్రాక్టర్లు 9, జేసీబీ1, స్వీపింగ్ యంత్రం 1, రెండు బ్లేడ్ వాహనాలు ఉన్నాయి. ఆర్మూర్ పట్టణంలో రోజుకు 30 టన్నుల చెత్తను సేకరించి కోటార్మూర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. కాని వాహనం మరమ్మతులకు గురైతే బాగు చేయించకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో ఎండ, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. అలాగే ప్రతిరోజు ఏదో ఒక చెత్త వాహనం మరమ్మతులకు గురువుతున్నాయి. కాగా రిపేర్ చేయడానికి కనీసం 15 రోజుల వరకు సమయం పడుతుంది. ఇంటి పన్నులు, ఆస్తి పన్నులు, వారాంతపు సంత తదితర మార్గాల్లో మున్సిపల్‌కు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా వాహనాల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ట్రాక్టర్లు, చెత్త వాహనాలను మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

వృథాగా స్వీపింగ్ యంత్రం

పట్టణంలోని రోడ్లను శుభ్రపరిచేందుకు పట్టణ ప్రగతి నిధులు రూ.48 లక్షలతో స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేశారు. తీసుకువచ్చిన కొత్తలో ఒక నెల రోజులు సైతం పనిచేయకుండానే మరమ్మతులకు గురైంది. కాని వాటిని మరమ్మత్తులు చేయించడంలో అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో వృథాగా పడి ఉంది.

వినియోగంలోకి తెస్తాం



మరమ్మతులకు గురైన వాహనాలను రిపేర్ చేయిస్తాం. నిరుపయోగంగా ఉన్న స్వీపింగ్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం. పారిశుధ్యం విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.
– ప్రసాద్ చౌహన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ప్రణాళిక లేని కల్వర్టుల నిర్మాణం

- అమ్రాద్ తండావాసులకు శాపం
- వృథా కానున్న రూ.60 లక్షలతో నిర్మించిన కల్వర్టులు



ఒకే ద్వారంతో నిర్మిస్తున్న కల్వర్టు

మాక్లూర్: సరైన ప్రణాళిక లేకుండా ప్రభుత్వ సొమ్ముతో ఆయా శాఖలకు చెందిన కొందరు ఏఈలు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు పూర్తి చేయటంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకు మండలంలోని అమ్రాద్ తండాను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ తండాలో ఒక్కసారి వర్షం కురిస్తే నెల రోజుల వరకు రాకపోకలు నిలిచిపోతాయి. తండాకు అతి సమీపంలో ఉన్న లోలెవల్ రైల్వే బ్రిడ్జి కింద ఒక్క వర్షానికే సుమారు 100 అడుగుల లోతుతో నీరు నిండిపోతుంది. ఖాళీ కావటానికి చిన్న రంధ్రం ఉండటం ఒక కారణం. నీరు ఖాళీ కావటానికి 15 నుంచి 20 రోజుల సమయం పడుతోంది. ఈ సమస్యను తీర్చటానికి ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నుంచి రెండు కల్వర్టుల నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తి చేశారు. కాని మళ్లీ సమస్య మొదటికొచ్చేవిధంగా ఉందన్న విషయం తండావాసులకు కల్వర్టులు నిర్మాణం పూర్తయితే కాని తెలిసి రాలేదు. పై నుంచి వచ్చే లింగం, లోలం, నేరడి చెరువుల అలుగు నీరుతో పాటు గుట్టల ఎగువ నుంచి వచ్చే భారీ వరదనీరు నిర్మాణం అయిన రెండు కల్వర్టుల నుంచి సులువుగా వెళ్లిపోయే అవకాశం కన్పించటం లేదు. గతంలో ఉన్న రెండు కల్వర్టులు వరద నీటి తాకిడికి పూర్తిగా కొట్టుకుని పోయిన సందర్భంలోనే రైల్వే లో లెవల్ వంతెన కింద నీరు ఖాళీ కావటానికి నెల రోజులు పట్టింది. కొత్తగా నిర్మించిన కల్వర్టులు ఒక్క వర్షానికే కొట్టుకు పోవటమే కాకుండా కల్వర్టులకు ఉన్న రెండు మూడు ద్వారాల నుంచి నీరు వెళ్లలేక సమస్య మళ్లీ మొదటికే వస్తుందని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వంతెనలు నిర్మించి, సమీపంలో ఉన్న నిజాంసాగర్ ప్రధాన కాల్వపై ఉన్న పాత వంతెనకు మరమ్మతులు చేపడితే తప్ప అక్కడ చేరే వరద నీరు ఖాళీ కాదు. అప్పటి వరకు అమ్రాద్ తండా ప్రజల కష్టాలు తీరవు.

చెప్పినా విన్పించుకోలేదు



నేను ముందే చెప్పాను. చిన్నగా నిర్మించే కల్వర్టుల వల్ల ప్రయోజనం ఉండదని. అప్పట్లో సంబంధిత అధికారి బడ్జెట్ లేదని ఉన్నదాట్లో కట్టుకోండి అంటూ చెప్పారు. మేము కూడ సరే అనుకున్నాము. కట్టిన తరువాత తెలిసింది. పై నుంచి మూడు చెరువుల అలుగు నుంచి వచ్చే వరద నీరు ఈ కల్వర్టుల కింద నుంచి వెళ్లటం కష్టంగా మారుతుందని. కథ మొదటికి వచ్చేవిధంగా ఉంది. – మెగావత్ కిషన్‌లాల్, మాజీ సర్పంచ్, అమ్రాద్ తండా

రైతు ఐక్య ఉద్యమాలు నిర్మించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

బోధన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలను నిలువరించేందుకు రైతు ఐక్య ఉద్యమాలు నిర్మించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆయన మాట్లాడారు. బోధన్‌లో గతంలో జరిగిన అనేక రైతు ఉద్యమాలు, మలి దశ తెలంగాణ ఉద్యమంలో సంఘం కీలక పాత్ర వహించిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోవడం వల్లే ప్రజలు గద్దె దించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, గుమ్ముల గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కే. గంగాధర్, నాయకులు పుట్టి నడ్పి నాగన్న, పార్వతి, పడాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామ మందిర పునర్నిర్మాణ కమిటీ సమావేశం



కమిటీ సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

రుద్రూర్: మండల కేంద్రంలో కొనసాగుతున్న శ్రీరామ మందిర నిర్మాణం పనులు వేగిరం చేయడానికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని కమిటీ సభ్యులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం గ్రామ పెద్దలు, ప్రముఖులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణం కోసం స్వచ్ఛందంగా డబ్బులు సమకూర్చిన దాతలు, విరాళాలు అందజేసిన ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి సహకారాన్ని కోరారు. దాతలు ఆర్థిక సహకారాన్ని అందజేస్తే దేవాదాయ శాఖ నిధులు విడుదల కాగానే తిరిగి వాపస్ చేస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఇప్పటి వరకు ఆలయ నిర్మాణం కోసం భక్తులు రూ.13 లక్షలు కమిటీకి అందజేశారని పేర్కొన్నారు. విరాళం రూపంలో మరో రూ.12 లక్షలు వచ్చాయని వివరించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



సమావేశమైన నూతన కమిటీ సభ్యులు

ఆర్మూర్: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు ముందుంటేనే ఉన్నతమైన సమాజాన్ని తీర్చిదిద్దవచ్చని నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాడవేడి నారాయణ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో నటరాజ నృత్యనికేతన్ నాట్య గురువు మృణాళిని అధ్యక్షతన ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అంతకు ముందు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబా మాట్లాడుతూ తమ సంస్థ అనాథలకు, విధివంచితులకు సేవలందించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నూతన కమిటీని అభినందించారు. సంస్థ ఆర్మూర్ విభాగం కమిటీ సభ్యులు అశోక్, ఫణీంద్ర, మధు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర



పాదయాత్రగా శ్రీశైలం వెళుతున్న శివ స్వాములు

రుద్రూర్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయానికి శివ మాలధారణ స్వాములు ఆదివారం శివదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలు దేరారు. శివ దీక్ష ప్రారంభించి 20 ఏళ్లు అవుతున్న సందర్భంగా పాదయాత్ర చేస్తున్నట్లు స్వాములు వెల్లడించారు. బోధన్ చక్రేశ్వర స్వామి ఆలయం నుంచి బయలు దేరిన స్వాములు ఉమ్మడి జిల్లాలోని రుద్రూర్, బాన్సువాడ, పిట్లం మీదుగా 12 రోజుల్లో శ్రీశైలం చేరుకుంటారు. సుమారు 310 కిలో మీటర్ల పాదయాత్ర చేసి పుణ్య క్షేత్రానికి చేరుకుంటామని స్వాములు వెల్లడించారు. రుద్రూర్ మండల కేంద్రంలో శివ దీక్ష తీసుకున్న మాలధారణ స్వాముల పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. పాలు, పండ్లు అందచేశారు.

వీహెచ్‌పీని విస్తరించాలి



సుభాష్‌నగర్: గ్రామగ్రామాన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)ను విస్తరించేందుకు ప్రతి కార్యకర్త సమయం ఇవ్వాలని తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ముదుపు యాదిరెడ్డి పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఇందూరు జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ముదుపు యాదిరెడ్డి మాట్లాడుతూ.. రామమందిర నిర్మాణం కోసం 500 ఏళ్ల సుదీర్ఘపోరాటం చేశామని గుర్తుచేశారు. వీహెచ్‌పీ ప్రతి గ్రామంలో విస్తరిస్తే ఇలాంటి ఉద్యమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ఠాకూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గోనె లాలయ్య గత నెల 9న గుండెపోటుతో మరణించారు. ఆదివారం జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, మహ్మద్ లతీఫ్ లాలయ్య కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. భార్యకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ నుంచి రూ.లక్ష సహాయం, భార్యకు ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్, పిల్లల చదువుకు స్కాలర్‌షిప్ అందే విధంగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. సీనియర్ జిల్లా జర్నలిస్టులు శ్రీనివాస్, చందు, వీరయ్య పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

జగదాంబ్రి ఆలయంలో జెడ్పీ చైర్మన్ పూజలు

నవీపేట: యంచ గ్రామంలోని శ్రీ ఓం జగదాంబ్రి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్ ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారికి నిర్వహించిన తలంబ్రాల సమర్పణ, కల్యాణ ఉత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీ ఓం ఆదిశక్తి పీఠాధిపతి స్వర్ణకమల లక్ష్మి, తాజా మాజీ సర్పంచ్ కొట్టాల లహరి పాల్గొన్నారు.